పాలకోడేటి సత్యనారాయణరావు

ఈ పిల్లకు పెళ్లికాదు!

కృష్ణ ఆ సమయంలో రావటం రామ్మూర్తికి ఆశ్చర్యాన్ని కలుగజేసింది. ఇంట్లో మెత్తటి పరుపుమీద అందమైన బాంబే డయింగ్ కవర్లమీద హాయిగా అందంగా ఆనందాన్ని అనుభవిస్తూ, చేస్ నవలను చదువుతూ ఆ నవలలోనున్న సంఘటనలకు సైతం ఆశ్చర్యపడని రామ్మూర్తి, కృష్ణ రావటం చూసి మరింతగా ఆశ్చర్యపోయ్యాడు.

ఆ సమయంలో అసలు కృష్ణ రావటమే ఆశ్చర్యం. నవలలోని ఆనందానికీ, ఆశ్చర్యానికీ అంతరాయం కలిగిస్తూ తలుపుతట్టిన చప్పుడు. విసుగుతో తలుపుతీశాక చూస్తే వచ్చింది ప్రాణస్నేహితుడు-కృష్ణ!

గడియారాన్ని చూశాక రామ్మూర్తికి ఆశ్చర్యం రెట్టింపయింది. గడియారంలో ముల్లు రెండూ కూడబలుక్కున్నట్లుగా పన్నెండు దగ్గర చేరాయి.

"రా, రా, కాయా. పండా?"

కృష్ణ ఏమీ అనలేదు. నెమ్మదిగా లోపలికి నడిచాడు. లోపలికినడిచి, నెమ్మదిగా పరుపుమీద కూర్చుంటూ అన్నాడు : "కాయా, పండా అనడిగితే నేనేం చెప్పను! నేనా అమ్మాయిని అసలు చూడనేలేదు."

రామ్మూర్తి షాక్ తిన్నాడు–"అదే మిత్రా?"

"అదేమిత్రా అంటే ఏంచెప్పను?" అంటూ షూ విప్పుకొన్నాడు కృష్ణ. పరుపుమీద వెల్లకిలా పడుకొంటూ పైన తిరుగుతున్న ఫానుకేసి చూశాడు కృష్ణ–ఫాను గిరగిర తిరుగుతూ ఉంది–ఫానుకున్న బ్లేడులేవీ కనబడ్డంలేదు. కృష్ణకు నవ్వొచ్చింది–ఎంత గొప్ప సామ్యం ఇది–ఒక వ్యక్తిలో ఉన్న గుణాలన్నీ కలిసి గుప్తంగా ఉంటాయి. ఆ గుణాల్లో మోసం ఎక్కువగా ఉందో, కక్షఎక్కువగా ఉందో, ఆప్యాయతా ఆదరణలెక్కువగా ఉన్నాయో సామాన్యంగా తెలీదు. కానీ పరీక్ష అనేది ఓ సమయంలో వస్తే...ఫాను ఆపగానే కనబడే బ్లేడుల్లాగ—ఏ గుణంకు ఆ గుణం తేటతెల్లమైపోతుంది–కానీ ప్రాణస్నేహితుడనుకొనే వాడే ఇలా చేస్తే...?

'సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్!' అంటారు. కానీ తీపికూడ ఎక్కువైతే మొహం మొత్తినట్లుగా, స్నేహంకూడ హద్దుదాటితే, బీటలు తీస్తుందేమో!

"ఏమయిందిరా అంటే జవాబు చెప్పవేం?" రామ్మూర్తి మళ్లీ అడిగాడు.

కృష్ణ పేలవంగా నవ్వాడు– "అది సరేగానీ, ముందీ సంగతి చెప్పరా–ప్రాణస్నేహితుణ్ణి మోసం చేయదలిచిన వాణ్ణి ఏం చేయాలిరా?"

రామ్మూర్తికి ప్రశ్న అర్థంగాలేదు. "అసలు ఏం జరిగిందిరా?"

"ముందు నా ప్రశ్నకు జవాబియ్యి!"

"ఏం చేసినా తప్పు లేదంటాను."

"అయితే నిన్నేం జేసినా తప్పు లేదురా! అయినా నన్ను మోసం చేయలనే ఊహ నీ కెప్పుడొచ్చిందిరా?"

రామ్మూర్తి తెల్లపోయాడు. క్షణం ఆగి అడిగారు కృష్ణను–"అసలు జరిగిందేమిటో చెప్పకుండా నన్నిలా నిలవేయటం ఏం బాగుంటుంది?

"నీకు సరోజ అంటే అసహ్యం ఎందుకు కలిగిందిరా?"

రామ్మూర్తికి క్షణంపాటు ఒళ్లు మండిది తన్ను తాను సంబాళించుకొంటూ నెమ్మదిగా అన్నాడు : "కృష్ణా! ఒకసారి ఈ సంగతి చెప్పు. నువ్వసలు ఏమంటున్నావో తెలిసే అంటున్నావా?"

"ఆ, నీకే ఆశ్చర్యంగా ఉండి ఉండాలి నాకీ సంగతి తెలిసిపోయిందని! నువ్వూ సరోజా ప్రేమించుకొన్న సంగతి నాకు తెలిసిపోయింది!"

రామ్మూర్తి పకాలున నవ్వాడు : "సరోజా నేను ప్రేమించుకోవటమా?"

"నవ్వకురోయ్ రామ్మూర్తి-నాకు ఒళ్లుమండిపోతోంది. నువ్వు సరోజను ప్రేమించావు బాగానే ఉంది. మీ ఇద్దరికీ గొడవొచ్చిందనుకో, అంతమాత్రంచేత చేసుకోనంటే ఎలారా –. అలా అయినా బాగానే ఉండేది-నాకు అర్థంకానిదొక టేరా—మీ ఇద్దరికీ గొడవొస్తే సరోజను చేసుకోమని నాకు నువ్వు సలహా ఇవ్వటమే !"

"అర్థం లేకుండా మాట్లాడకురా కృష్ణా! సరోజ, నేనూ ఒకే ఆఫీసులో పని చేస్తున్నమాట వాస్తవమేగానీ, మిగతాది-అదే, సరోజను నేను ప్రేమించటం, మా ఇద్దరికీ గొడవొచ్చి, నీ స్నేహాన్ని నేనేదో దుర్వినియోగం చేసుకోవటం... ఇదంతా అట్టర్ నాన్సెన్స్! నీకు ఆ పిల్లను చేసుకోవటం ఇష్టంలేకపోతే ఆ సంగతి స్పష్టంగా ఏడు అంతేగానీ ఇలా అమ్మాయిమీద నిందలు వేయకు! నీకు ఇంకో సంగతి చెప్పనీ నన్ను—ఈ క్షణంవరకు సరోజతో ఒక్కసారంటే ఒక్కసారైనా మాట్లాడి ఎరగను నేను-నిన్ను మోసంచేయాలనే ఊహే లేదు నాకు! నువ్వు సరోజను చేసుకొంటావో, చేసుకోకుండా గంగలో దిగుతావో నీ ఇష్టం! అంతట నువ్వు నన్ను సరోజను గురించి అడిగావు కనుక 'మంచిపిల్లే చేసుకో' అన్నాను. కేగాని ఇందులో నాకేమీ ఇంటరెస్ట్

"అంటే సరోజ నీకసలు తెలీనే తెలీదా?"

"తెలీదు. ఇంతకీ అసలు సంగతి చెప్పు-సరోజ నచ్చలేదుటా?"

"సరోజ నచ్చకపోవటం దాకా ఎందుకు. నేనసలు ఆవిడను చూడనే లేదు!"

రామ్మూర్తి ఆశ్చర్యపోతూ అడిగాడు: "మరి పెళ్లిచూపులకే గదరా వాళ్ల ఇంటికి వెళ్లింది."

"నేను వెళ్లింది వాళ్ల ఇంటికి కాదు, వాళ్ల ఊరికి వెళ్లాను! అంతే, ఆపైన ఇంకేమీ జరగలేదు!"

"అదేం?"

"అదేమంటే, ఇంకా ఏం చెప్పను? ఆ ఊళ్లో దిగీ దిగ్గానే తెలిసింది నీకూ సరోజకూ ఏదో సంబంధం ఉందని."

"అలా కాదుకానీ, జరిగింది జరిగినట్లు చెప్పరా..." అన్న రామ్మూర్తికి చెప్పటం కోసం జరిగింది గుర్తుకు తెచ్చుకున్నాడు కృష్ణ

* * *

ఊరికి అరమైలు దూరంలో ఉన్న చిన్న షెడ్ ముందు రైలు ఆగింది. కృష్ణ రైల్లోంచి దిగాడు. తనుకాక ఇంకా ఎవరో ఇద్దరు దిగారు ఆ రైల్లోంచి. రైలు కదిలేంతవరకూ అక్కడే నిలబడ్డాడు. రైలు కదలాక చూస్తే తనకోసం ఎవరూ వచ్చినట్లుగా కనిపించలేదు అతనికి.

వెనక్కు వెళ్లిపోదామా అని క్షణం

ఆలోచించాడు- పెళ్లిచూపులకు తనొస్తున్న సంగతి ముందుగానే వాళ్లకు తెలుసు. అయినా వాళ్లు రాలేదు. ఎందుకో!

రామ్మూర్తి చెప్పనే చెప్పాడు-సరోజ వారం రోజులు సెలవుపెట్టి ఇంటికి వెళ్లిందని!- కానీ తనకోసం ఎవరూ రానేలేదు.

స్టేషన్ మాస్టరు వచ్చి టికెట్ తీసుకొనివెళ్లాడు. దాంతో స్టేషన్లో మనుష్యులందరూ వెళ్లిపోవటంతో, స్టేషన్ నిర్మానుష్యం అయిపోతోంది. తను తిరిగి వెళ్లాలన్నా సాయింత్రం వరకు రైలు ఏదీలేదు. ఇక్కడా చేయగలిగేది ఏదీ లేదు. నెమ్మదిగా కదిలాడు, స్టేషన్లోంచి బయటకు.

బయట చెట్టుకిందనున్న టీకొట్లో టీ తాగి బయటకు వచ్చాడు. అక్కడే ఒక బల్లమీద కూర్చున్న ఒకతన్ని అడిగాడు: "ఏమండీ... మీకు సుందరరామయ్య గారిల్లు తెలుసా?"

"ఏ సుందరరామయ్య?"

ఏ సుందరరామయ్యో తనకు తెలీదు. ఎలా గుర్తుచెప్పటం?- "వాళ్ల అమ్మాయి పేరు సరోజ అని..."

అతను లేచాడు. నెమ్మదిగా అన్నాడు: "ఓహో, వాళ్లా? వాళ్లు మీకేమైనా చుట్టాలా?"

"కాదులెండి, కొంచెంపనుంది. వాళ్ల ఇల్లెక్కడో చెబితే..."

కృష్ణకేసి తేరపార చూశాడు అతను. క్షణం ఆగి అన్నాడు- "పదండి, వాళ్ల ఇంటికేగా, నేనూ వస్తా ఊళ్లోవరకు!"

ఇద్దరూ కదిలారు. పది అడుగులు వేశాక అడిగాడు అతను కృష్ణను: "మీ పేరు రామ్మూర్తా."

తెల్లపోయాడు! "కాదు."

"మీరు సుందరరామయ్యకు ఏమవుతారు?"

"నేను వాళ్లకు ఏమీకాను?"

"మరింకేమిటి పని?"

కృష్ణకు విసిగెత్తింది - పల్లెటూరు అయితే ఇదే బాధ. ఊళ్లోవాళ్ల అందరి గొడవలూ వీళ్లకే కావాలి! తన్ను తను తిట్టుకొంటూ జవాబిచ్చాడు: "వాళ్ల అమ్మాయిని చూడ్డానికి రమ్మన్నారు. అందుకని!"

నడుస్తున్న ఆవ్యక్తి ఒకసారి హఠాత్తుగా ఆగిపోయాడు: "మీ పేరు రామ్మూర్తి కాదంటిరిగా!"

"కాదు!"- రామ్మూర్తి ఈ ఊళ్లో బాగానే పేరు సంపాదించినట్లుగా ఉన్నాడు

ఆ వ్యక్తి నెమ్మదిగా అన్నాడు: "మరేంలేదులెండి, ఎందుకడిగానంటే, నాతో సుందరరామయ్య చెప్పాడు- వాళ్లమ్మాయి సరోజ రామ్మూర్తినే చేసుకొంటూందని! బహుశా మీరే రామ్మూ అనుకొన్నాను! అని క్షణం ఆగి అనుకొంటున్నట్లుగా అనా

"బహుశా చెడి పో యిం దే మో ఆ సంబంధం–''

కృష్ణకు ఛెళ్ళున తగిలింది ఆ మాట–'బహుశా చెడిపోయిందేమో ఆ సంబంధం అంటే...రామూర్తీ ఎంతకు తెగించావురా నువ్వు! నన్ను విసిరావేం ఈ వల్లోకి?–'

కృష్ణ తేరుకొంటూ అడిగాడు. "మీరు చెప్పేది సరోజ గురించేనా?"

"ఆ, ఆ పిల్లనుగురించే చెప్పేది. ఆ రామూర్తీ సరోజా ఇక్కడ ఎన్నో సార్లు కలిసితిరగటం నా కళ్ళతోనే చూశాను. ఆ మాటే అంటే. సుందర రామయ్య అ పుడు చెప్పాడు–వాళ్ళిద్దరూ పెళ్ళిచేసుకొంటారని! ఏం జరిగిందో ఏమో మరి..."

ఊళ్ళోకి వచ్చారు ఇద్దరూ. ఆ వ్యక్తి దూరంగా ఉన్న ఒక ఎత్తుఅరుగుల ఇల్లు చూపిస్తూ అన్నాడు. "అదే సుందర రామయ్యగారిల్లు. నేను ఇటు వెళ్ళాలి!" అంటూ పక్కనే ఉన్న వీధిలోకి తిరిగాడు.

కృష్ణ క్షణంసేపు ఆ ఎత్తు అరుగుల ఇంటికేసి చూశాడు–అరుగులు ఎత్తేగానీ, నైతికంగా...కృష్ణ వెనక్కు తిరిగాడు.

* * *

"ఆశ్చర్యంగా ఉందిరా కృష్ణా నువ్వు చెప్పింది! నువ్వు నన్ను నమ్మూ. నమ్మకపో, సరోజతో నేనింతవరకూ ఒక సారైనా మాట్లాడలేదు. కానీ ఆఊర్లోనేను ఇంత పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవటం ఆశ్చర్యంగానే ఉంది!"

కృష్ణ ఏమీ అనలేదు.

రామూర్తి నెమ్మదిగా అన్నాడు–"రేపు వాళ్ల ఊరికి వెళదాం రా!"

''ఎందుకు?''

"ఈ సంగతి తెలుసుకొని తీరాలిరా! తప్పదు. ఇంత జరిగిందంటే, దీని వెనక ఏదో ఉండి ఉండాలిరా!"

కృష్ణకు ఈ విషయం ఆసక్తి కలిగింది. "అయిఉండొచ్చురా, ఇదేదో కథ లాగే ఉందిరా! వెయ్యి అబద్ధాలు ఆడి అయినా ఒక పెళ్లి చెయ్యమన్నారు కానీ, ఇక్కడ ఒక్క అబద్ధంతోటే పెళ్ళి చెడగొట్టార్రా! ఆశ్చర్యంగానే ఉంద ఆలోచిస్తోంటే!"

మర్నాడు ఇద్దరూ ఆ స్టేషన్లోదిగి సరోజ ఇంటికేసి నడిచారు.

వీళ్ళు ఆ ఇల్లు–ఎత్తు అరుగుల పెంకిటిల్లు–చేరుకొనేసరికి సరోజ అరుగుమీద కూర్చొని ఏదో చదువుకొంటోంది. వీళ్లను చూచి లేచి నిలబడింది.

''సుందరరామయ్యగారిల్లు ఇదేనా?"

ఔనంది సరోజ.

"అయితే, ఆయన లేరా–"

"లేరు, ఇపుడే బయటకెళ్లారు. రండి లోపలికి!" అంటూ లోపలికి దారితీసింది. వీళ్లుకూడా లోపలికి నడిచారు. గుమ్మం దాటగానే ఎదురుగాఉన్న ఫోటోలో

సుందరరామయ్య చిరునవ్వులు చిందిస్తూ కనబడ్డాడు.

కృష్ణకు మతిపోయింది—ఇతనా సుందరరామయ్య?

"కూర్చోండి! ఇపుడే వస్తాను!" అంటూ లోపలికి వెళ్ళింది సరోజ.

కృష్ణ ఇంక ఆపుకోలేకపోయాడు—"మూర్తీ. నిన్న నాకు చెప్పింది ఇతనేరా!'' అంటూ ఫోటోకేసి చూపించాడు. రామ్మూర్తి ఆ ఫోటోకేసి చూశాడు.

సరోజ, వాళ్ళమ్మ బయటకొచ్చారు. రామ్మూర్తి వాళ్ళకు సంజాయిషీ ఇస్తున్నట్లుగా అన్నాడు —"క్షమించండి, నిన్ననే రావాల్సింది. కానీ..."

"ఫర్వాలేదులెండి." అంటూ, కృష్ణ ఫోటోకేసిచూస్తూ ఉండటంచూసి అంది సరోజ ''అది మా నాన్నగారి ఫోటో!"

రామూర్తి కృష్ణ ఇద్దరూ తెల్లబోయారు.

రామూర్తి నెమ్మదిగా తేరుకొన్నాడు—"నిన్న మీరు మాకోసం వెయిట్ చేసి ఉంటారు! కానీ..."

''బహుశా రైలు తప్పిపోయి ఉంటుంది!'' నవ్వుతూ అంది సరోజ.

"నేను వెళ్ళి కాఫీ తెస్తాను బాబూ! అమ్మాయితో మాట్లాడుతూ ఉండండి—" అంటూ లోపలికి వెళ్ళింది సరోజా వాళ్ల అమ్మ.

రామ్మూర్తి అన్నాడు సరోజతో "చూడండి, మేమెందుకొచ్చామో మీకింకా తెలీదనుకొంటా!"

"తెలీకేం, మీరు పెళ్ళిచూపులకేగా వచ్చింది!"

కృష్ణ నవ్వాడు ప్రతిగా నవ్వుతూ అంది సరోజ: మీరేం ఆశ్చర్యపోనక్కర్లేదు. నాకు బాగా అలవాటయిపోయింది. మీది బహుశా ఏ ఇరవయ్యవదో అయిఉంటుంది. అందుకే పెళ్ళిచూపులంటే మొదట్లో ఉండే బిడియమూ సిగ్గూ అన్నీపోయాయి. మీరు రాగానే చాల ఈజీగా రిసీవ్ చేసుకొనే పరిస్థితికి వచ్చాను!''

కృష్ణ నవ్వుతూ అడిగాడు: "మీరేమీ అనుకోనంటే...''

"అడగండి-మీ రడిగేదేదో నాకు తెలిసిపోయింది.రామ్మూర్తిగారి గురించేగా మీరడిగేది?" నవ్వి, నెమ్మదిగా అంది సరోజ. "మీరు చాలమందికన్నా చాల నయం. చాలమంది అక్కడికక్కడే వెళ్ళిపోయారు. మీరు కనీసం ఇంటి వరకు అయినా వచ్చారు. థాంక్స్! —మీరు నన్ను చేసుకొన్నా, చేసుకోకపోయినా ఒక సంగతి రామ్మూర్తిగారెవరో నాకింతవరకూతెలీదు. మేమిద్దరం ఒకే ఆఫీసు అయినా నేసింతవరకూ ఆయన్ను చూడనైనాలేదు అనవసరంగా నావల్ల ఆయనకు చెడ్డపేరొస్తోంది," అంటూ ఆగింది సరోజ-ఆసంగతి ఎవరు చెబుతున్నారోగానీ, అందరికీ అదే చెబుతున్నారు. ఎందుకో అర్థం కావటంలేదు!



"నాకు అర్థమవుతోంది!" అంటున్న రామ్మూర్తిని కట్ చేస్తూ అంది సరోజ– "అదుగో, నాన్నగారు రానే వచ్చారు!"

లోపలికి వచ్చిన సుందరరామయ్య కృష్ణను చూసి నివ్వెరపోయాడు.

"మీరా?–"

"..."

సరోజ లోపలికి వెళ్ళిపోగానే అన్నాడు సుందరరామయ్య. "నన్ను క్షమించండి బాబూ! గుర్తు పట్టలేక పోయాను–"

కృష్ణ సంబాళించుకొంటూ అన్నాడు– "పర్వాలేదులెండి. అయినా ఈ సంగతి చెప్పండి, ఎందు కిలా చేశారు?"

"ఎలా?"

"మీ అమ్మాయికీ, రామ్మూర్తికీ సంబంధం ఉందంటూ..."

సుందరరామయ్య ధైర్యంగా అన్నాడు– "అది ఉన్నమాటే గదండీ, నిప్పులేనిదే పొగ రాదని సామెత. అన్ని సంబంధాలు వచ్చినా, అన్నీ చెడిపోతున్నాయి. దీని ప్రవర్తనవల్ల. ఏం చేయను?"

"చెడిపోతున్నా యనకండి! చెడగొట్టానని చెప్పండి సుందరరామయ్యగారూ!- ఈరోజువరకు ఆ రామ్మూర్తి మీసరోజను ఎరగనే ఎరగడు. ఎందుకంటే నేనే ఆ రామ్మూర్తిని గనుక! ఎందుకిలా చేస్తున్నారు?" రామ్మూర్తి గట్టిగానే అడిగాడు.

సుందరరామయ్య ముఖాన కత్తి వేటుకు నెత్తురుచుక్క లేదు. తేరుకొంటూ అన్నాడు-"ఎందుకిలా చేస్తున్నానంటే ఏం చెప్పను బాబూ! దౌర్భాగ్యం! కన్న తీపి కన్నకడుపుతీపి ఎక్కువయివండ్. సంపాదించే ఒక్కపిల్ల చేయిజారిపోతే, మేము చేతులు చాచుకొని భిక్షం అడుక్కోవాల్సిన పరిస్థితి వస్తుంది. అందుకే.. అందుకే...ఏ తండ్రీ, ఏబిడ్డకూ చేయని ద్రోహం చేస్తున్నాను!" భోరున ఏడ్చాడు సుందరరామయ్య. "మీరు నాకన్న చిన్నపిల్లలు. అయినా చేతులెత్తి మొక్కుతాను. మీరు వెళ్ళిపోండి. నాకున్న ఈ ఒక్క ఆధారమూ పోగొట్టి నన్ను అనాథను చేయకండి!"

రామ్మూర్తీ, కృష్ణా చాలసేపు నిశ్శబ్దంగా నిలబడ్డారు

"సుందరరామయ్యగారూ——ఒక్క మాట.. నేను సరోజను చేసుకొంటానండీ." అన్నాడు రామ్మూర్తి హటాత్తుగా.

"వద్దుబాబూ వద్దు! పిల్లమీద నింద ఉంటే పిల్లకు పెళ్ళి కాదనే ధైర్యంతో పిల్లను అపనిందలపాలుజేసి చస్తూబతుకుతున్నాను. నాకున్న ఈ ఒక్క ఆధారాన్ని పోగొట్టకండి!"

"మీ రనవసరంగా బాధపడకండి! సరోజ పెళ్ళి అయిపోతే మీకున్న ఒక్క ఆధారము పోవటం ఎలాగవుతూంది? ఇపుడు మీరు ఒక్కరిమీదే ఆధారపడి ఉంటే పెళ్లయాక ఇద్దరం మీకు ఆధారం అవుతా. మీ పరిస్థితి నేను అర్థంచేసుకొనే చెబుతున్నాను. నన్ను కాదకనండి!"

రామ్మూర్తి ఇంకా ఏదో అనబోతున్నాడు. సుందరరామయ్య వినటం లేదు. సుందరరామయ్యకు ఆ అనుభూతి కొత్తగా ఉంది. మనిషిని మనిషి ఇంత చక్కగా అర్థంచేసుకొంటాడని అతనికి తెలీదు. ఇంతటి ఆనందం పట్టలేక, కళ్ళనుండి నీరు ధారగా కారుతున్నాయి.

తలుపు దగ్గర నిలబడ్డ సరోజకు మతిపోయింది. ఆనందంతో సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయిపోతోంది. ఆ ఆనందంలో తండ్రిని తేలికగా క్షమించేసింది సరోజ.

రామ్మూర్తి చర్యకు మనసులో జోహార్లు పలుకుతున్నాడు కృష్ణ.